క్లుప్తంగా

సచివాలయాల నేమ్‌బోర్డులు పెట్టండి



పెడన: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అన్ని సచివాలయాల ముందున్న నేమ్ బోర్డులను తొలగించిన విషయం తెల్సిందే. కోడ్ ఎత్తివేసినా ఆయా వార్డు సచివాలయాలు ఎదుట నేమ్ బోర్డులు పెట్టలేదని పలువురు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మంగళవారం సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తొమ్మిది సచివాలయాల ఎదుట నేమ్ బోర్డులుండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా సచివాయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ఆయా సచివాయాల ముందు నామఫలకాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక అర్చనలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పరాసుపేట శ్రీ సువర్చల సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. వడమాల వేసి అలంకరించారు. సుహాసినిలు 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది.

పారిశుద్ధ్య కార్మికుడికి పాముకాటు

మచిలీపట్నంటౌన్: నగరంలోని తొమ్మిదో డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికుడు ఆంజనేయులు మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీలో పనులు చేస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. దీంతో ఆంజనేయులును హుటాహుటిన జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ ఆంజనేయులును పరామర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

కబేళాను వినియోగంలోకి తేవాలి

మచిలీపట్నంటౌన్: నగరంలోని కబేళాను వినియోగంలోకి తేవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందజేశారు. కబేళా నిర్వహించకపోవడంతో నగరంలో అనారోగ్యంతో ఉన్న, మృతి చెందిన జీవాల మాంసాలను విక్రయిస్తున్నారని దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. కబేళా ఉన్న సమయంలో వెటర్నరీ వైద్యులు జీవాలకు వైద్య పరీక్షలు చేసిన అనంతరమే మార్కెట్‌లోకి అనుమతించేవారని గుర్తు చేశారు. కబేళా మూతపడటంతో ఈ ప్రక్రియ జరగక పర్యవేక్షణ ఉండటం లేదన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జోగి శివ, ధనికొండ చిన్ని, నిప్పు రాధాకృష్ణ, తోకల అంతర్వేది, బెల్లంకొండ రవి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు



అవనిగడ్డ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సింహాద్రి రవీంద్రబాబు ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్త, సామూహిక పఠనా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సహకారంతో నగదు బహుమతులు అందించడంతోపాటు 200 మంది బాల బాలికలకు 200 నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. భగవద్గీత శిక్షణ కార్యక్రమాన్ని ఉపాసకుడు మత్తి శేషగిరిరావు (గురుజీ) 15 రోజులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక చారిత్రాత్మకం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం చారిత్రాత్మకమని పలువురు కూటమి నాయకులు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు కూటమి నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోండి

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలను వినియోగించుకోవాలని భవిత మినుము రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎండీ ఆత్కూరి సీతారామరాజు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలు, గర్భిణులకు భవిత మినుము రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సంఘం ఎండీ సీతారామరాజు, డైరెక్టర్ రెడ్డొతు రాంబాబుల చేతుల మీదగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

తాగునీటి కష్టాలు

- అడుగంటిన మంచినీటి చెరువులు
- ఊటబావులే ఆధారం



నీళ్లు లేక అడుగంటిన బంటుమిల్లి పంచాయతీ మంచినీటి చెరువు

బంటుమిల్లి: వేసవి వెళ్లినా.. తాగునీటి కష్టాలు బంటుమిల్లి మండలవాసులకు తప్పడం లేదు. మండలంలో చెరువుల్లో జల అడుగంటడంతో ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో 21 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ సాగునీటి కాలువకు నీరు విడుదల చేసి దాదాపు మూడు నెలలు దాటింది. వేసవిలో నీటి విడుదలకు తోడు వడగాలులకు చెరువుల్లోని నీరు అడుగంటి మట్టి దిబ్బలు బయటపడ్డాయి. చెరువుల్లో మురుగు నీరు చిక్కబడి ఫిల్టరు కాకపోవడంతో పంచాయతీ అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. కొన్ని పంచాయితీల్లో రోజు విడిచి రోజు నీరు విడుదల చేస్తున్నారు. మరి కొన్ని పంచాయతీల్లో బోర్లు ద్వారా నీటిని అందజేస్తున్నారు.

తాగునీటికి బావులు, ఆర్వో ప్లాంట్లే ఆధారం

పంచాయతీల్లోని రక్షిత తాగునీటి పథకాలు అలంకారప్రాయంగా మారడంతో ప్రజలు బావులు, ఆర్వో ప్లాంట్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. గ్రామాల్లో కాల్వ కట్టలపై ఏర్పాటు చేసిన బావుల వద్ద రాత్రి, పగలు బిందెడు నీళ్ల కోసం పరుగులు పెడుతున్నారు. బావుల వద్ద నీరు అందకపోతే రోజూ రూ.20 ఖర్చుపెట్టి 20 లీటర్ల ఆర్వో ప్లాంటువారు అమ్ముతున్న క్యాన్లు కొనుక్కుంటున్నారు. ఆ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా నీరు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఆర్వో ప్లాంట్లపై తమకు పర్యవేక్షణ లేదని వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై పర్యవేక్షణ ఎవరిదన్నది ప్రశ్నార్థకంగా మారింది.



నాగేశ్వరరావుపేట సమీపంలో కాల్వకట్టపై బావి వద్ద డ్రమ్ములతో గ్రామస్తులు

పర్యవేక్షణ లోపం

గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు లక్షలు ఖర్చు చేస్తున్నా పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లేవనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీల్లో చెరువులు, ఫిల్టర్లు మరమ్మతులకు గురైతే గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. సిబ్బంది కొరతతోపాటు నామినేషన్ల పద్ధతిలో చేసే కాంట్రాక్ట్ పనుల్లో నాణ్యత కరువైందనే విమర్శలూ ఉన్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ వారి పర్యవేక్షణలో నడుస్తున్న మల్లేశ్వరం, ఆముదాలపల్లి, చోరంపూడి గ్రామాల్లోని పథకాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ స్కీంలో ఫిల్టరు బెడ్లు, మైక్రోఫిల్టర్లు ఉన్నా గ్లాసెడు నీళ్లకు దిక్కు లేదు. ఈ పథకాల్లో అనుభవం లేని సిబ్బంది నిర్వహణ కారణంగా మైక్రోఫిల్టర్లు కూడా అలంకారప్రాయంగా మారాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు రంగుమారి వాసన వస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. లక్షలు ఖర్చు చేసి రక్షిత మంచినీటి పథకాల్లోని చెరువులు, ఫిల్టరు బెడ్లు, పైపులైన్లు, మైక్రోఫిల్టర్లు మరమ్మతులు చేస్తున్నా ప్రజలకు ఉపయోగపడటం కన్నా కాంట్రాకర్లు, అధికారుల జేబులు నింపుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

లక్షలాది రూపాయలు కేటాయించిన చైర్‌పర్సన్ హారిక

మండల పరిధిలోని రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేయించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు జెడ్పీ గ్రాంటు నుంచి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దాదాపు రూ. 2 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభం అవుతుండగానే ఎన్నికల కోడ్ రావడం, ఆ వెంటనే వేసవి రావడంతో ఆమె సంకల్పం నెరవేరక ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పలేదు.

కాల్వలకు నీరు వస్తే చెరువులు నింపుతాం

బంటుమిల్లి కాల్వకు నీరు రాగానే తాగునీటి చెరువులకు నీరు నింపుతాం. నామినేషన్ పద్ధతిపై చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లు, బోర్లు ద్వారా నీరు అందిస్తున్నాం. ఆర్వోప్లాంట్లపై ఆర్‌డబ్ల్యూఎస్‌కు పర్యవేక్షణ బాధ్యత లేదు. ఇసుక ఫిల్టర్ల వద్ద పాత ఇసుక అక్కడే ఉంచుతామని మరమ్మతులో కొత్త ఇసుక వినియోగిస్తున్నాం. మండలంలో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంలేదు.

–నాగేశ్వరరావు, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నైపుణ్యమున్న సిబ్బందిని నియమించాలి




మంచినీటి పథకాల నిర్వహణకు నైపుణ్యం ఉన్న సిబ్బందిని నియమించాలి. సర్పంచ్‌లు మారిన ప్రతిసారి సిబ్బందిని మార్చడాన్ని స్వస్తి చెప్పాలి. అక్రమ కుళాయిలను నియంత్రించి స్కీం సామర్థ్యాన్ని బట్టి ఇంటింటికీ, కుళాయిలు ఏర్పాటు చేయాలి.

–మాజేటి శివశ్రీనివాసరావు, జానకిరామపురం, బంటుమిల్లి

జంగిల్ క్లియరెన్స్

కోడూరు: ఇరాలి–రామకృష్ణాపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారికి రెండువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు దట్టంగా పెరిగి కొమ్మలు రహదారిపై ప్రయాణికులకు తగలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కోడూరుకు చెందిన బచ్చు వెంకటేష్ స్పందించి ముళ్ల కంప తొలగించేందుకు పూనుకున్నాడు. సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాడు.

వారాహిదేవికి ప్రత్యేక పూజలు



నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాలలో మంగళవారం మహేశ్వరీదేవి రూపాంతరంలో పూజలు నిర్వహించారు. వారాహి దీక్ష కంకణ బద్ధులైన ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖరశర్మ బ్రహ్మత్వంలో వేకువజామున వారాహి మహేశ్వరి అమ్మవారికి విశేష పూజతో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు. శ్రీరామక్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) బోయపాటి రాము, కమిటీ పెద్దలు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

దుర్గాకోటేశ్వరస్వామి ఆలయంలో..

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలోని శ్రీ దుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు విద్యాసాగర్‌శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉన్నతాధికారుల దృష్టికి మహిళా మత్స్యకారుల సమస్యలు

నాగాయలంక ఎండు చేపల సంత ప్రాంతాన్ని సందర్శించిన ఏడీ



ఎండు చేపల సంత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫిషరీస్ ఏడీ ప్రతిభ, మత్స్యకార నేతలు

నాగాయలంక: స్థానిక ఎండు చేపల వారపు సంత(డ్రై ఫిష్ మార్కెట్) ప్రదేశాన్ని అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్. ప్రతిభ మంగళవారం సందర్శించారు. దీన్ని మత్స్య వాణిజ్యకేంద్రంగా గుర్తించాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు నేతృత్వంలో ఇక్కడ పర్యటించిన మత్స్య ప్రతినిధుల బృందం గత ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె ఎండు చేపల సంతను సందర్శించారు. ఆమెను కలసిన మత్స్యసొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ డైరెక్టర్ నాగిడి తాతారావుతో మాట్లాడుతూ ఇక్కడ మహిళా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

నేడు దేవస్థానం చెరువుల బహిరంగ వేలం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన చెరువుల కౌలు హక్కులకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు ఈ నెల 10వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించనున్ననట్లు వివరించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

45వ డివిజన్ సచివాలయాన్ని పరిశీలించిన కమిషనర్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు సీజనల్ వ్యాధులపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు సూచించారు. నగరంలోని 45వ డివిజన్ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయానికి సిబ్బంది సకాలంలో వస్తోందీ, లేనిదీ హాజరుపట్టీలను పరిశీలించారు. సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, సిబ్బంది విధులు, సమయపాలన వంటి విషయాలపై అడ్మిన్ అల్లాభక్షును అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో వైద్యసిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులు ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకుని ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించేందుకు త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అవకాశముందన్నారు. అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కేంద్ర నిధులు సాధించి గ్రామాల్లో తాగునీరు, రహదారుల సమస్యలను ప్రణాళికతో పరిష్కరించడానికి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి గ్రామ పరిధిలో సమస్యలను నివేదిక రూపంలో అందిస్తే పవన్ కల్యాణ్ సహకారంతో నిధులు సాధిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టితత్వం, సమన్వయంతో పని చేసి ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీ నారాయణ, ఎంపీడీవో మరియా దేవి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు దిడ్ల కిరణ్, పులిగడ్డ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త చెత్తగా..

- శిథిలమైన డంపర్‌బిన్లు, పుష్‌కార్ట్స్
- చిందరవందరగా చెత్త
- దోమల స్వైరవిహారం
- రోడ్లపై పశువుల సంచారం



బందరులో రైతుబజారు వద్ద ధ్వంసమైన డంపర్‌బిన్



నగరంలోని ప్రధాన రహదారిపై పశువులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుండటంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. చెత్త వేసే ప్రాంతాల్లో ఉన్న ఐరన్ డంపర్‌బిన్లు శిథిలమయ్యాయి. వీటిలో వేస్తున్న చెత్త ఆ ప్రాంతంలో పడుతున్నాయి. ఈ చెత్తను పందులు, ఆవులు చిందరవందర చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్న పుష్‌కార్ట్స్‌కూడా శిథిలమై చెత్త తీసుకువెళ్లేందుకు ఇబ్బంది కలుగుతోంది. వీటిని బ్యానర్లు, అట్ట ముక్కలు అడ్డు పెట్టుకుని కార్మికులు చెత్తను తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కలెక్టర్ డీకే బాలాజీ ఇటీవల నగరంలో పర్యటించిన సమయంలో డస్ట్‌బిన్లను తొలగించి ఆ చెత్తను నేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని ఆదేశించినా నగరంలోని అన్ని ప్రాంతాల్లో అమలు కావడం లేదు. దీంతో సమస్య తప్పటం లేదు. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న నేపథ్యంలో డంపర్‌బిన్లు ఉన్న ప్రాంతంలో అస్తవ్యస్త పరిస్థితులతో అంటువ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రోడ్లపై కదిలే స్పీడ్‌బ్రేకర్లు

నగరంలో ఎక్కడ చూసినా ఆవులు, గేదెలు రోడ్లనే ఆవాసాలుగా చేసుకుని విహారం చేస్తున్నాయి. రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో సైతం ఆవులు, గేదెలు రోడ్డుకు అడ్డుగా పడుకోవటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గేదెలు కనిపించక వాహనాలు వాటిని ఢీకొని గాయపడిన ఘటనలు కోకొల్లలు. నగరంలోని చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, గాంధీబొమ్మ శివాలయం, కోనేరుసెంటరు సమీపంలోని జిల్లా గ్రంథాలయం తదితర ప్రధాన కూడళ్లలో సైతం ఆవులు, గేదెలు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. పశుపోషకులు పాలు తీసుకున్న అనంతరం వటిని రోడ్డుపై వదిలేస్తుండటంతో సమస్య పరిష్కారం కావడం లేదు.



ఇంగ్లీషుపాలెంలో దెబ్బతిన్న పుష్‌కార్ట్‌కు బ్యానర్ అడ్డుగా పెట్టి చెత్త సేకరిస్తున్న దృశ్యం

నగరంలో పర్యటించిన కలెక్టర్ బాలాజీ రోడ్లపై పశుసంచారాన్ని నివారించడానికి పశుపోషకులతో సమావేశం ఏర్పాటు చేయాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించలేదు. ఫలితంగా సమస్య జటిలమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గ్రామాల్లో వైద్యసేవలపై ఆరా



కోనలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో గీతాభాయి

కోనేరుసెంటర్: జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతా భాయి మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాల్లో పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించి వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ సిబ్బందిని అడగడం, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది సేవలు ఉత్తమంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ



ప్రసంగిస్తున్న పీడీ సువర్ణ

పెడన: మహిళలు ఆరోగ్య సమస్యలను అధిగమించి అన్ని రంగాల్లో రాణించాలని, కుటుంబ వ్యవస్థను చక్కదిద్దుకున్నప్పుడే ఆ సమాజం బహు బాగుంటుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ అన్నారు. స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో మంగళవారం సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మిషన్ శక్తి స్కీంపై పీడీ సువర్ణ మాట్లాడారు. నిరుపేదలైన ప్రతి మహిళకు ఈ మిషన్ శక్తి స్కీం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ యోజన ద్వారా గర్భిణులు పేర్లు నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కృష్ణాజిల్లాలో మిషన్ శక్తి స్కీంలో భాగంగా సఖి వన్ స్టాప్ సెంటర్ నడుపతున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలకు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్ ఉమెన్స్ హెల్ప్ లైన్ 181, హెల్ప్ లైన్ నంబర్ 1098, 100, 112 నంబర్లకు కాల్ చేయవచ్చునన్నారు. సహాయ ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్ బాషా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మహిళలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం అందించే బెనిఫిట్స్, 100 రోజుల పాటు జరిగే తదితర ఆక్టివిటీస్‌లో భాగంగా సహాయ ఫౌండేషన్ సహాయ సహకారాలను అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



అవనిగడ్డ: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సహకారంతో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, అంజనాస్ ఫౌండేషన్‌చైర్మన్ బచ్చు నవీన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వెంకట్రామ్ మాట్లాడుతూ యువతీ, యువకులు నచ్చిన కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చు నవీన్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అపోలో ఫార్మసి, టాటా టెక్నాలజీస్, స్కిల్‌నడర్ ఎలక్ట్రిక్, రిలయన్స్ డిజిటల్, మథర్ సన్ సుమీ సిస్టం, ఎయిర్ టెల్, తదితర కంపెనీలు సుమారు వెయ్యి మందికి పై యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.